# అల్లరి పిల్ల(లు)

-తోకల రాజేశం

అబ్బా...! ఏం పిల్లలు? కోతులు. ఒక్క పట్టానా ఉండరు. ఇంట్లో అందంగా సర్దిన వస్తువులన్నీ చెల్లా చెదురు చేసేస్తూ నానా రభస. అరె! అల్లరి చేయవద్దని ఎంతచెప్పినా వినిపించుకోరేం? చెప్పినంతసేపూ "అలానే అమ్మా!" అంటూ వినయం ఒలకపోస్తూ, కాసేపు కాగానే మళ్లీ అదేవరస. వీళ్లతో వేగలేక ఛస్తున్నాను. వీళ్లకు...

ఏంటి లక్ష్మి! ఆమె మాటలు పూర్తి కాకుండానే అన్నాడు వెంకటేష్ అనునయంగా.

"లేకపోతే ఏంటండీ! వీళ్ల ఆగడాలకు హద్దులేకుండా పోతున్నాయి. నేనొక వైపు చెబుతూనే ఉన్నాను హార్లిక్స్ ఒకరిమీద ఒకరు పోసుకొన్నారు" కనుబొమ్మలు ముడిపడ్డాయా సమయంలో.

మళ్లీ అందుకొని "అయినా దీనికంతటికీ కారణం మీరే. మిమ్మల్ననాలి. పిల్లలను మరీ గారాబంగా చూడొద్దంటే వినరు. ఇప్పుడు చూడండి. వీళ్లెలా నెత్తినెక్కి కూర్చున్నారో... వీళ్లతో నేను వేగలేనండీ" అంటూ కుర్చీలో కూలబడిపోయింది.

"నువ్వనసరంగా బి.పి.తెచ్చుకోకు. వాళ్లనలా వదిలేయ్... ప్రతీ చిన్న విషయానికీ..." మధ్యలోనే ఆపేశాడు.

"ఆ....! మీరలా వెనుకేసుకొస్తూనే ఉండండి. ప్రతీదీ మీకు చిన్నగానే కనిపిస్తోంది. ప్రతీ దాంట్లో నాతప్పే కనిపిస్తోంది. వదిరి వదిరీ నాకు తలనొప్పి లేస్తోంది గాని ఏం లాభం లేదు" బుంగమూతి పెట్టింది.

"ఆ సరే గాని, కాఫీ పట్టుకురా" తాగేసి రైల్వే స్టేషన్‌కి వెళ్లాలి.

రైల్వే స్టేషన్‌కా? ఎందుకో? మూతి అదోలా పెట్టింది.

ఓసినీ... నీకు మతిమరుపులు ఎక్కువైనాయే? మీ అమ్మ వస్తోన్న విషయం కూడా మరిచిపోయావన్న మాట.

అవునండీ! ఛీ... ఏం బుద్ధి!... అమ్మ వస్తోన్న విషయం కూడా గుర్తులేదు. ఎప్పుడూ టెన్షనేనాయె పిల్లలతోటి" అంటూ కిచెన్‌లోకెళ్లింది.

"మళ్లీ మొదలెట్టావా పురాణం? ఆ కాఫీయేదో నా మొహాన కొట్టు. ట్రెయిను వచ్చే వేళయింది".

"సర్లేండి సంబరం. అన్నింటికీ నన్నే అంటారు" అంటూ కాఫీ తెచ్చిచ్చింది.

"కాఫీ సిప్ చేస్తూ, సరేగాని వేడినీళ్ళు పెట్టి ఉంచు. వచ్చినాక మీ అమ్మగారు స్నానం చేస్తారు" అంటూ వెళ్ళిపోయాడు.

○ ○ ○

"అమ్మమ్మా!" అంటూ కేకేసి గుమ్మం దగ్గరే జానకిని చుట్టుముట్టారు పిల్లలిద్దరూనూ.

ఆ కేక విని వంటింట్లో ఉన్న లక్ష్మి గబగబా గుమ్మం దగ్గరికి పరుగెత్తుకొచ్చింది.

"అమ్మా! బాగున్నావా? ఇంటి దగ్గర నాన్నగారు బాగున్నారా? అన్నయ్యలు...."

"ఇక ఆపుతావా? ఇలా గుమ్మంలోనే నిలబెట్టి ప్రశ్న మీద ప్రశ్న వేయకపోతే ఇంట్లోకి తీసుకెళ్లి కూర్చోబెట్టి కాస్త రిలాక్స్ అయిన తర్వాత అడగరాదూ? అసలే నాలుగ్గంటల ప్రయాణం ఆ ఊరు నుంచి ఈ ఊరికి" అంటూ సామాను లోపలికి తీసుకెళ్ళాడు వెంకటేష్.

తల్లి జానకిని ఇంట్లోకి తీసుకెళ్ళి సోఫాలో కూరోబెట్టింది లక్ష్మి.

"నువ్వు బాగున్నావా అమ్మా!" ప్రేమగా అడిగింది జానకి.

"నేను బాగానే ఉన్నానమ్మా!" బలవంతపు నవ్వు మెరిసింది లక్ష్మి పెదవులపై

దాన్ని పసిగట్టింది జానకి. కూతురుకు తెలియకుండానే.

"బాత్రూమ్‌లో వేడి నీళ్లు పెడతాను. త్వరగా స్నానం చేయి. తర్వాత అందరం కలిసి భోజనం చేద్దాం" అన్నది లక్ష్మి.

## పండగ!

ఉదయం / భోగిమంటలు
మధ్యాహ్నం / పిండి వంటలు
సాయంత్రం / గుడి గంటలు
రాత్రంతా ఆలోచనలతో
గుండె మంటలు!

-మిస్టర్ గుడి

"సరే తల్లీ!" అంటూ బాత్రూమ్‌లోకెళ్ళింది జానకి.

స్నానం ముగించుకొని "పిల్లలూ! ఇటురండి. ఇదిగో స్వీట్స్ తీసుకోండి" అని పిలవగానే రమ్య, సౌమ్య జానకి ఒళ్ళో వాలిపోయారు.

తెచ్చిన స్వీట్లను ఇద్దరికీ సమానంగా పంచి యిచ్చింది. అయినా నాకు ఎక్కువ అంటే నాకు ఎక్కువ అని తగవులాడుకొంటున్నారు పిల్లలిద్దరూ.

లక్ష్మి కోపోద్రేకంతో వంటింట్లో నుంచి వచ్చి ఇద్దరిని చెరొకటి తగిలించింది.

"ఎంత చెప్పినా వినిపించుకోరు. రోజు రోజుకీ వీళ్లగోల మరీ ఎక్కువవుతోంది" అసహనం తొంగి చూసిందామె గొంతులో.

పిల్లలిద్దరూ బుంగమూతి బెట్టి వాళ్ల నాన్న దగ్గరికి చేరి నేలమీద కాలితో ఏవో గీతలు గీస్తూ కూర్చొన్నారు.

"ఎందుకమ్మా కొడతావు. పిల్లలు, వారికేం తెలుసు. ఆ చెప్పేదేదో కాస్త శాంతంగా చెప్పాలి. ఇలా కొడ తావా? ఇంకెప్పుడు ఇలా చేయకమ్మా" జానకి సున్నితంగా చెప్పింది.

"ఇలా కొడుతూనే ఉన్నా వినట్లేదు. ఇక మాటల్తోనే అయితే ఏం వింటారు. నెత్తినెక్కుతారు" అంటూ పిల్లల వైపు కోపంగా చూసింది లక్ష్మి.

"ఆ...! ఇక భోజనాలు కానిద్దామా?" తల్లీ కూతుళ్ల సంభాషణకు అడ్డుతగులుతూ చెప్పాడు వెంకటేష్.

డైనింగ్ టేబుల్ మీద అందరికీ వడ్డించింది లక్ష్మి. తల్లి జానకి కోరటంతో తానూ వడ్డించుకొంది. భోజనం చేస్తున్నంతసేపూ పిల్లలు చేసే ప్రతీ చిన్న తప్పుకి అసహనం కట్టలు తెంచుకొంటోంది లక్ష్మి గొంతులో. ఇవన్నీ జానకి గమనిస్తూనే ఉంది.

భోజనాలయ్యాక అందరూ అలవాటు ప్రకారం డాబా మీదికెళ్లారు. కాసేపయిన తర్వాత పిల్లలు నిద్రొస్తోందనటంతో వెంకటేష్ వాళ్లను తీసుకొని ఇంట్లోకి వెళ్లిపోయాడు.

"ఎన్నాళ్లైందమ్మా! ఇలా నీ ఒళ్లో చల్లగా సేదతీరి" కాస్త బాధ వినిపించింది లక్ష్మి గొంతులో

"జానకి కళ్లు సజలాలయ్యాయి" కాసేపు మౌనం రాజ్యమేలిందక్కడ.

"ఏంటమ్మా? దేని గురించి అంతలా బాధ పడి పోతున్నావు. నేను వచ్చినప్పటి నుంచి గమనిస్తూనే ఉన్నా ఏం జరిగిందో చెప్పు తల్లీ" ప్రాధేయపడింది జానకి.

"నా బాధంతా పిల్లల గురించేనమ్మా! వాళ్లు ఏం చెప్పినా వినటం లేదు. రోజు రోజుకీ వాళ్ల ఆగడాలు ఎక్కువై పోతున్నాయి. వాళ్లు ఇక మారరా అమ్మా?" సన్నగా రోదించసాగింది లక్ష్మి.

"పిచ్చిపిల్ల. ఈపాటి దానికే ఎందుకంతలా బాధ పడుతున్నావు. నీకు గుర్తున్నట్టు లేదు. నీవు చిన్నప్పుడు ఎలా ప్రవర్తించే దానివి? నీ తోటి పిల్లలను తిట్టే దానివి. కొట్టేదానివి ఇంటికి వచ్చిన పెద్దలను కూడా నానా దుర్భాషలాడే దానివి. ఇంట్లో చాలా గొడవ చేసే దానివి. చెప్పిన మాట వినేదానివి కాదు. బయటి నుంచి రోజుకొకటైనా నీ మీద ఫిర్యాదు వచ్చేది. అయినా నిన్నేనాడు మీనాన్నగారు కాని, నేను కాని కొట్టలేదు. బయటి వాళ్లకిలాగో సరిది చెప్పేవాళ్లం. చిన్న పిల్లలప్పుడు ఇది సహజమే అని సరిపెట్టుకొనే వాళ్లం. అంతలా అయితే సున్నితంగా మందలించే దాన్నంతే. అయినా అప్పటి నీ అల్లరితో పోలిస్తే నేడు మీ పిల్లలు చేస్తున్నది తక్కువే. దీంట్లో మీ పిల్లలది ఏ మాత్రం తప్పులేదు. ఆ వయసు అలాంటిది. ఏ వయ సులో చేయాల్సిన పనులు ఆ వయసులో చేయాలి. ఈ వయసులో వాళ్లు అల్లరి చేయాలి. అప్పుడే వాళ్లు ఆనందంగా ఉంటారు. ఇలా నీవు ప్రతీ విషయానికీ ప్రతిబంధకంగా ఉంటే నీ పిల్లల వ్యక్తిత్వ వికాసానికి నీవే అడ్డు తగులుతున్నావన్నమాట. నీ పిల్లలను ఆనం దానికి దూరం చేస్తున్నావన్న మాట. ఈ విషయం మాత్రం గుర్తుంచుకో" సూచన ప్రాయంగా చెప్పింది జానకి.

జానకి మాటలు విన్న లక్ష్మి కళ్లు జలజలా వర్షించ సాగాయి. తనకు మూసుకుపోయిన కళ్లు తెరిచి నట్లని పించింది.

తన చిన్ననాటి చేష్టలు ఒక్కొక్కటే జ్ఞప్తికి రాసాగాయి లక్ష్మికి అప్పటి చేష్టలు తల్చుకొంటే. సిగ్గుతో బుగ్గలు ఎర్రగా మారాయి. కాని ఇప్పుడు పిల్లలతో ప్రవర్తిస్తున్న తీరును తల్చుకొంటే తన మీద తనకే అసహ్యం వేస్తోంది.

ఇప్పటికైనా తన కళ్లు తెరిపించినందుకు కృతజ్ఞ తతో తల్లి చేతులను పట్టుకొని ఏడవ సాగింది.

జానకి ఓదార్చింది. తన కూతురులో మార్పు వచ్చినందుకు జానకి లోలోపల చాలా సంతోషించింది.

కాసేపటి తర్వాత ఇద్దరూ ఇంట్లోకి వెళ్ళిపోయారు.

లక్ష్మి పడుకొన్న తన పిల్లల దగ్గరకెళ్ళి బుగ్గలను ముద్దాడింది. ప్రేమతో ఇక ఎప్పుడూ మిమ్మల్ని బాధ పెట్టను అన్నట్లుగా. ■